క్లుప్తంగా

మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం సందర్భంగా మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. మూల విరాట్‌లకు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, అమ్మవార్లకు కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్య సంతర్పణ తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామి దర్శనార్థం తరలి వచ్చారు. నిర్వాహకులు అన్నదానం చేపట్టారు.

చిన్న పరిశ్రమలతో ఆర్థికాభివృద్ధి



సర్వే చేస్తున్న అధికారులు

మద్దికెర : చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించడం వల్ల పనులతో పాటు ఆర్థికాభివృద్ధి వేగంగా సాధ్యమవుతుందని వీపీఏ జాకీర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో చిన్న పరిశ్రమలు స్థాపించడానికి ఎంఎస్‌ఎంఈ సర్వే చేపట్టారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మొబైల్ క్యాంటీన్లు, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారితో పాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వంటి వాటిపై సర్వే చేస్తున్నామని చెప్పారు. అన్ని వివరాలు పొందుపరిచిన వెంటనే ఉద్యమ్ గుర్తింపు సంఖ్యతో ప్రత్యేక రిజిస్ట్రేషన్ ధ్రువ పత్రం జారీ చేయబడుతుందన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ అనిల్ పాల్గొన్నారు.

కందిపంట పరిశీలన



బోయబొంతిరాళ్లలో కంది పంట కాలిపోయిన పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ వెంకటేశ్వర్లు

కృష్ణగిరి: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని కంది పంట అగ్నికి ఆహుతైన పొలాన్ని ఆదివారం మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, వీఆర్వో అనిల్‌కుమార్ పరిశీలించారు. బాధిత రైతు రంగన్న కుటుంబ సభ్యులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంటను రక్షించుకునే క్రమంలో ప్రమాదంలో రైతు గాయాలు కావడంతోపాటు ఆరు ఎకరాలకు సంబంధించిన కంది పంట పూర్తిగా కాలిపోయిందన్నారు. దాదాపు రూ.2.5 లక్షల వరకు నష్టపోయారన్నారు. సంఘటనకు సంబంధించి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.


గురుకుల విద్యార్థినులకు అభినందన



రాష్ట్రస్థాయికి ఎంపికైన బాలికలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వెల్దుర్తి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు శనివారం కర్నూలులో జరిగిన వైద్య విజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపడంపై ఎంఈఓలు ఇందిర, రమేష్, గురుకులం ప్రిన్స్‌పాల్ లక్ష్మి ప్రసూన అభినందించారు. ప్రదర్శనలో భాగంగా తమ విద్యార్థినులు పదవ తరగతి కె మహిత, తొమ్మిదవ తరగతి జి.గాయత్రి గ్రూపు విభాగంలో చేసిన ×వెహికల్ ప్రొటెక్షన్ కవర్¥ ప్రాజెక్ట్ జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైనట్లు వారు ఆదివారం తెలిపారు. విజేతలకు గైడ్‌లుగా వ్యవహరించిన హరిత, జ్యోతి ప్రసన్నను అభినందించారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మద్దికెర : శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆదివారం షష్టి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. దేవసేన, శ్రీవల్లి సమేతుడై కొలువుదీరగా అర్చకులు హోమాలు జరిపించారు. పూజలకు విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు విజయ్ పాల్గొన్నారు.

రైతులకు వరంగా..

- జగనన్న పాలనలో రూ.57 లక్షలతో వైఎస్సార్ అగ్రిల్యాబ్ ఏర్పాటు
- విత్తన పరీక్షలతో నకిలీలకు చెక్
- అగ్రిల్యాబ్‌లో పశువ్యాధుల నిర్ధారణ



విత్తన పరీక్షలను పరిశీలిస్తున్న ఏడీఏ సునీత

ఆలూరు రూరల్: రైతు సంక్షేమే లక్ష్యంగా గత ప్రభుత్వం హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నియోజకవర్గానికో సమగ్ర వ్యవసాయ పరీక్ష కేంద్రం (వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్) మంజూరు చేశారు. ఇందులో భాగంగానే పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 2021 సెప్టెంబర్ 8న వైఎస్సార్ జయంతి సందర్భంగా రూ.57 లక్షలతో నిర్మించిన అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇది రైతులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ఆరుగాలం శ్రమించే అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకూడదనే సంకల్పంతో పైసా ఖర్చు లేకుండా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ఉచితంగా ముందుగానే పరీక్షించుకునేలా చర్యలు చేపట్టారు. అగ్రిల్యాబ్‌కు వ్యవసాయ శాఖ ఏడీఏ, పశువుల ల్యాబ్‌కు ఏడీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్‌లు అందుబాటులో ఉన్నారు. ప్రారంభించనప్పటి నుంచి 459 విత్తన, 61 ఎరువుల పరీక్షలు నిర్వహించారు.

పశువులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు..

వ్యవసాయంతో పాటు పాడి రంగానికి అప్పటి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది. మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించడం కోసం అగ్రిల్యాబ్‌లో మరో విభాగాన్ని ఏర్పాటు చేసి పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వినియోగించాల్సిన మందులు తదితర అంశాలపై 9 రకాల ప్రయోగాలైన మూత్రం, పేడ, చర్మ సమస్యలు,వ్యాధి నిర్ధారణ రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత నాలుగేళ్ల నుంచి ఇప్పటి వరకు 1,059 పశువుల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు పశుసంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు.



పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్



ఆలూరు మార్కెట్ యార్డులో నిర్మించిన వైఎస్సార్ అగ్రిల్యాబ్

పైప్‌లైన్ లీకేజీతో అవస్థలు



రాంపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి శభాష్‌పురం వెళ్లే దారిలో పైప్‌లైన్ లీకేజీతో అవస్థలు పడుతున్న వాహనదారులు

హంద్రీనీవా రిజర్వాయర్ ద్వారా చెరువులకు నీళ్లు మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్ లీకేజీ అవడంతో రాంపల్లి ఎక్స్ రోడ్డు నుంచి శభాష్‌పురం వెళ్లే మార్గంలో రోడ్డు దెబ్బతినింది. దీంతో ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని జీజీరాల్ల సోమశేఖర్‌గౌడ్ వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలు అరికట్టాలని కోరారు. - తుగ్గలి

ఉల్లాసంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఖాజాబేగ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1960 సంవత్సరం నుంచి గతేడాది పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థులందరితో ఏటా జనవరి మొదటి ఆదివారం నిర్వహించే పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఆద్యంతం ఉల్లాసంగా సాగిన కార్యక్రమంలో తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. గత 25 ఏళ్లుగా కొనసాగుతూ, 2016లో రిజిస్టరైన పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వావిలాల కృష్ణమూర్తి అధ్యక్షతన సాగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శంకరయ్య, మోహనరెడ్డి, కృష్ణకుమార్ మాస్టార్లు అమూల్య సందేశాలందించారు. 2024 రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పాఠశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత బోయనపల్లె హైస్కూల్ హిందీ పండిట్ ఖాజాబేగ్‌ను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులందరినీ సంఘటితం చేసి, సంఘం బలోపేతానికి, పాఠశాల అభివృద్ధికి, భవిష్యత్ విద్యార్థులకు సేవలు విస్తరించేందుకు కృషి చేస్తామని వెల్దుర్తి హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం నూతన అధ్యక్షుడు, రిటైర్డ్ హెచ్‌ఎం అగస్టీన్ తెలిపారు. సంఘం సెక్రటరీ రవిశంకర్, ట్రెజరర్ లక్ష్మన్న మాట్లాడుతూ 64 ఏళ్ల పాఠశాల చరిత్రలో ఎందరో ఉన్నతంగా ఎదిగారని, అందరిని సంఘటితం చేసే దిశగ తాము కృషి చేస్తూ సేవలు కొనసాగించామంటూ వార్షిక రిపోర్టు వివరించారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన కమిటీ ప్రెసిడెంట్‌గా అగస్టీన్, వైస్ ప్రెసిడెంట్‌లుగా టీచర్ ఖాజాబేగ్, కాంతారెడ్డి, సెక్రటరీగా మల్లెపల్లె సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా లక్ష్మణస్వామి, తాజ్‌బాబ, ట్రెజరర్‌గా పెద్ద ఖాజాబేగ్, కార్యానిర్వాహక సభ్యులుగా సురేశ్ యాదవ్, కృష్ణఫర్, సత్యం, జనార్ధన్, అరాఫత్, చక్రవర్తి, అల్లాబకష్, షెక్షావలి ఎన్నికయ్యారు.

విద్యతోనే జీవితాల్లో మార్పు



విద్యార్థికి బహుమతి ఇస్తున్న ఎస్‌ఐ బాలనరసింహులు

హొళగుంద: విద్యావంతులైతే ప్రయోజకులవుతారని ఎస్‌ఐ బాల నరసింహులు అన్నారు. వివిధ కారణాలతో చదువులు మధ్యలో ఆపవద్దని కోరారు. ఆదివారం ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్, వరలక్ష్మి సెల్ఫ్ గ్రూపులు నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌ను సందర్శించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు వలసలు వెళ్తే వారి పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సీజనల్ హాస్టల్స్‌ను ప్రారంభించిందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి చురుకుగా సమాధానాలు చెప్పిన వారికి నగదు బహుమతి అందజేశారు. అనంతరం నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. సొసైటీ ప్రెసిడెంట్ చిన్నహ్యాట నాగరాజు గ్రామపెద్దలు చలపతి, నాగరాజుగౌడ్, సంజయ్‌కుమార్, హాస్టల్ సిబ్బంది సోహన్, దుర్గయ్య పాల్గొన్నారు.

రణమండల కొండలో శాంతిహోమం

ఆదోని అర్బన్: పట్టణశివారులోని రణమండల కొండలో వెలిసిన శ్రీ సంతాన ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం శాంతి హోమం నిర్వహించారు. ఆలయానికి ధ్వజస్తంభం, పాదాలు, గోపురానికి కలశం, వినాయక విగ్రహం ప్రతిష్ఠాపన చేసి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఈ హోమం చేపట్టారు. రణమండల ఆంజనేయస్వామి ఆలయ నిర్వాహకులు టీజీ పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్యక్రమ నిర్వాహకుడు ఏటీఎం శివకుమార్ పూజలు చేయించారు. ముందుగా సంతాన ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూరసేవ, తులసీహారం, పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మధ్య శాంతిహోమం నిర్వహించారు.

బండలాగుడు పోటీలు



బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

కౌతాళం: బదినేహల్ గ్రామ శివారుల్లో వెలసిన సిద్ధ శంకర్‌స్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలను వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్ ప్రారంభించారు. పోటీల్లో వెళేప్పగారి నాగరాజు ఎద్దులు ప్రథమ, ద్వితీయ బహుమతిని కంశిబాషా ఎద్దులు కైవసం చేసుకున్నాయి.

బోరు ఏర్పాటు



బోరు మిషన్ వద్ద సర్పంచ్, గ్రామస్తులు, విద్యార్థులు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బోర్ వేసినట్లు సర్పంచ్ విజయలక్ష్మి తెలిపారు. విద్యార్థులకు నీటి సమస్య ఉండటంతో స్పందించిన కలెక్టర్ బోర్‌వెల్‌ను పంపి బోరు వేయించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. బోరు వేయడంపై ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు వడ్డే గాదిలింగప్ప, కురువ తిప్పేస్వామి పాల్గొన్నారు.

మెదేహాల్‌లో.. : మండలంలోని మెదేహాల్ గ్రామంలో ప్రజలకు మంచి నీటిని అందించేందుకు బోరు వేయించామని సర్పంచ్ ఉమాదేవి ఆదివారం తెలిపారు. గ్రామస్తులు, స్కూల్ పిల్లలకు నీటి కొరత ఉండడంతో బోరు వేయించినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రహ్లాద, సురేంద్రపటేల్ ఉన్నారు.

జయప్రదం చేయండి

ఆస్పరి: స్కీం వర్కర్ల వేతనాలు పెంపు కోసం ఈనెల 7వ తేదీన కర్నూలు కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన వర్కర్లు చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నారన్నారు. వీరిని కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా పట్టించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. స్కీం వర్కర్ల వేతనాలు పెంచకపోతే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, బ్రహ్మయ్య, బడేసాహెబ్, రామయ్య, మహానంది పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి

పత్తికొండ(తుగ్గలి): బంగారు నిక్షేపాల వెలికితీత కోసం భూములు కోల్పోయిన రైతులకు జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీ న్యాయం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జొన్నగిరి–పగిడిరాయి, బొల్లవానిపల్లి మధ్య ఏర్పాటు చేసిన గోల్డ్ మైనింగ్ కంపెనీ పరిసరాలు, పొలాలను పరిశీలించి పలువురు రైతులతో మాట్లాడినట్లు తెలిపారు. గోల్డ్‌మైనింగ్ కంపెనీ నిక్షేపాలను వెలికితీసేందుకు 1,500 ఎకరాల భూమిని కొనుగోలు చేస్తామని మొదటల్లో చెప్పి.. 350 ఎకరాలు మాత్రమే కొనుగోలు చేసిందన్నారు. మిగిలిన భూములు లీజుకు తీసుకుని మైనింగ్ చేపట్టిందన్నారు. ప్రారంభంలో చెప్పిన మాట ప్రకారం భూములు కోల్పోయిన రైతు కుటుంబాల్లో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. మైనింగ్‌తో భూగర్భ జలాలు కలుషితమై పండ్ల తోటల రైతులు నష్టపోతున్నారని వారికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

మద్దికెర : సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్ విష్ణు, చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్డు పనులు పారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు నాణ్యతగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆదోని అర్బన్: కడితోట గ్రామ సమీపంలో ఆదివారం కారు, ఆటో ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. ఆదోని నుంచి పెద్దతుంబళం వైపు వెళ్తున్న ఆటో, మంత్రాలయం నుంచి ఆదోని వైపునకు వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆటోలో ఉన్న సుహాసిని, అమీన్, ఈరన్నగౌడ్, నరసింహులు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రశాంతంగా డీలర్ల రాత పరీక్ష



పత్తికొండలో రాత పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్


పత్తికొండ(తుగ్గలి) : చౌక దుకాణ డీలర్ల ఎంపికకు నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం స్థానిక జూనియర్ కాలేజీలో డీలర్లకు రాత పరీక్ష నిర్వహించారు. వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న, కొత్తగా ఉన్న 44 దుకాణాలకు గాను 31 దుకాణాలకు అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసు కున్నారు. ఈ రాత పరీక్షకు 199 అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాన్ని ఆర్డీవో ఎస్ భరత్‌నాయక్ తనిఖీ చేశారు. రాత పరీక్షలో అర్హత సాధించిన 116 మంది అభ్యర్థులకు సోమవారం ఉదయం 9 గంటలకు నుంచి ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు.



కృష్ణగిరి - ఎస్‌హెచ్ ఎర్రగుడి రహదారి దుస్థితి

'నరక'దారులు

- శిథిలమైన గ్రామీణ రహదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గుంతల మయంగా టి.గోకులపాడు - వెల్దుర్తి రహదారి



తొగర్చేడు నుంచి వెల్దుర్తికి వచ్చే రహదారిలో అడగడుగునా గుంతలే

కృష్ణగిరి: మండలంలో గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన పంచాయతీ రహదారులు గుంతలమయంగా మారి ఇటు వాహనదారులకు, అటూ ప్రయాణికులకు నరకం కనిపిస్తోంది. ఈ దారుల్లో వెళ్తే నడుము నొప్పులు ఫ్రీగా వస్తాయని చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రహదారులకు మహర్దశ కల్పిస్తున్నామని ఉపన్యాసాలు ఇస్తున్నా.. మండలంలో ఒక్క రహదారికి కూడా మోక్షం లభించలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రం, పక్క గ్రామాలకు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బోయబొంతిరాళ్ల నుంచి బొందిమడుగులకు వెళ్లే రహదారి చిధ్రమైన దృశ్యం





పెనుమాడ సమీపంలో కంది పంటను కోస్తున్న యంత్రం



కందులను కుప్పగా పోస్తున్న దృశ్యం

హోలికులకు హార్వెస్టర్ సాయం

కృష్ణగిరి: వ్యవసాయంలో సాంకేతికత, ఆధునిక యంత్రాల వినియోగం పెరిగిపోతోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా కూలీలతో పని లేకుండా, రైతుకు అధిక శ్రమ లేకుండా యంత్రాలు వినియోగిస్తున్నారు. నిన్నటి వరకు కంది పంట నూర్పిళ్లలో భాగంగా ముందుగా పంటను కోసి.. వారం రోజులు ఎండబెట్టి కూలీలతో నూర్పిడి చేయించి, వాటిని గాలికి తూర్పారబట్టి కందులను వేరు చేసేవాళ్లు. ఇలా వారం రోజుల పాటు కూలీలు, రైతులు శ్రమించి నూర్పిళ్లు పూర్తి చేసేవారు. ఇందుకు రైతులకు బాగానే ఖర్చయ్యేది. కానీ ఇప్పుడు అంతా మారింది.. యంత్రం సాయంతో గంటకే పంటను కుప్పగా పోస్తుంది. కంది పొలంలోకి దిగిన యంత్రం పంటను కోయడమే కాకుండా గింజలను తూర్పారబట్టి నేరుగా కుప్పగా పోస్తుండటంతో రైతులకు ఆర్థిక ఆదాతో పాటు శ్రమ తప్పింది. ప్రస్తుతం మండలంలో కంది కోతలు జోరందుకున్నాయి.



చెట్టు నిండా పూత

తుగ్గలి : మండలంలోని పగిడిరాయి–చెన్నంపల్లి వెళ్లే దారి పక్కనున్న తోటలో మామిడి చెట్టు విరగబూసింది. చెట్టు నిండా.. కొమ్మకు కొమ్మకు..ఆకులు సైతం కనిపించకుండా చెట్టంతా పూతతో నిండిపోయింది. ఆ మార్గం గుండా వెళ్లే రైతులు, వాహనదారులు విరగబూసిన మామిడి పూతను చూసి ఆశ్చర్యపోతున్నారు.